సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 24 । మే । 2025



బాలల ప్రతిభకు వేదిక బాలభవన్

రాజాంలోని మెంతిపేటలో ఉన్న బాలభవన్ బాలల ప్రతిభను వెలికితీసే వేదికగా మారింది. కళారంగాల్లో మక్కువ ఉన్న చిన్నారులకు శిక్షణ ఇస్తోంది. - 10లో



ప్రజాగ్రహానికి రాజకీయ రంగు!

సాలూరులో శ్యామలాంబ పండగ వైఫల్యాలకు రాజకీయ రంగు పులిమేందుకు కూటమి నాయకుల యత్నాలను ప్రజలు ఛీ కొడుతున్నారు. - 10లో



స్తంభాన్ని ఢీకొని కాలువలోకి దూసుకెళ్లిన కారు - 10లో

విజయనగరం నుంచి బొబ్బిలి వస్తున్న పెళ్లి కారు గ్రోత్ సెంటర్‌లో అదుపు తప్పి రాయగడ రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది.

సమావేశానికి వచ్చి.. రచ్చ చేసి!

- రణరంగానికి వచ్చినట్లుగా కౌన్సిల్ సమావేశానికి..
- ముందస్తు ప్రణాళిక అన్నట్లుగా పోలీసుల మోహరింపు
- ప్రారంభానికి ముందే బాహాబాహీ
- రౌడీ షీటర్లంటూ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌ను రెచ్చగొట్టిన ఫిరాయింపు కౌన్సిలర్
- సైకో చైర్‌పర్సన్ అంటూ మరోసారి ఓ మహిళపై నోరు పారేసుకున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర
- పక్కా టీడీపీ కార్యకర్తల మాదిరి వ్యవహరించిన ఖాకీలు
- వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను నెట్టుకొంటూ బయటకు పంపించిన వైనం

సాక్షి, పార్వతీపురం మన్యం:

❝ ఒక మున్సిపల్ సమావేశానికి పెద్ద ఎత్తున పోలీసులు మోహరించడం ఎప్పుడైనా చూశామా.. పోనీ, పాలకవర్గమేమైనా తమకు రక్షణ కల్పించాలని కోరిందా.. ఇంతకుముందు ఎన్నడైనా పెద్ద స్థాయిలో ఘర్షణలు జరిగాయా? మరి ఎవరి డైరెక్షన్‌లో పోలీసులు పార్వతీపురం మున్సిపల్ సమావేశానికి వచ్చినట్లు.. ఎవరి డైరెక్షన్‌లో సమావేశం ప్రారంభంలోనే లోపలికి ప్రవేశించినట్లు..!! ❞

❝ ఇరువురు ఘర్షణ పడితే.. ఇద్దరికీ సర్దిచెప్పి, అక్కడ నుంచి పంపించేయడానికి ప్రయత్నించడం, రాజీ కుదర్చడం ధర్మం. అలా అని ఒకరిని వదిలి.. రెండో వ్యక్తిని నెట్టుకొంటూ, తోసుకుంటూ.. కలబడుతూ బయటకు లాక్కెళ్లడం.. అదీ ధర్మం కోసం పని చేసే ఒక పోలీస్ అలా చేయడం న్యాయమేనా? పోలీసులు ఎవరి కనుసన్నల్లో పని చేస్తున్నట్లు? ❞

❝ దాదాపు అయిదు నెలల తర్వాత శుక్రవారం జరిగిన పార్వతీపురం మున్సిపల్ బడ్జెట్ సమావేశం పట్టుమని 20 నిమిషాలైనా నడవకుండానే ముగిసిపోయింది. బడ్జెట్, సాధారణ సమావేశాలు నిర్వహించాలని.. మున్సిపల్ అభివృద్ధిపై చర్చ జరపాలని పట్టుబట్టి, పోరాటం చేసి మరీ పాలకవర్గ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, వైఎస్సార్‌సీపీ సభ్యులు దానిని సాధిస్తే... అధికార పార్టీ ఎమ్మెల్యే కనుసన్నల్లో కూటమి సభ్యులు పక్కా ప్రణాళిక ప్రకారం వచ్చి, సమావేశాన్ని రచ్చచేసి వెనుదిరిగారు. అక్కడ జరగబోతోంది రణరంగమా అన్నట్లు.. పెద్ద ఎత్తున పోలీసులను వెంటబెట్టుకుని మరీ వివాదం చేయడం పట్టణ ప్రజలను విస్మయపరిచింది. ❞



పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్‌సీపీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కూటమి కౌన్సిలర్లు

అవసరం లేని అంశాలను అజెండాలో చేర్చి...

పార్వతీపురం మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహిస్తామని కమిషనర్ వెంకటేశ్వర్లు ప్రకటించారు. గురువారం మధ్యాహ్నం వరకు సమావేశ అజెండాను పాలకవర్గ సభ్యులకు అందజేయలేదు. మధ్యాహ్నం తర్వాత 74 అంశాలతో అజెండాను చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి వద్దకు పంపి, సంతకం చేయాలని చెప్పారు. అందులో అవసరం లేని అంశాలు రెండున్నాయని.. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో కలెక్టర్ అనుమతితోనే 24 మంది ఆప్కాస్ విధానంలో నియమితులైన ఉద్యోగుల ధ్రువపత్రాల పరిశీలన మరలా ప్రస్తుతం చేపట్టాలని పేర్కొనడం ఎంత వరకు సబబని చైర్‌పర్సన్ నిలదీశారు. వారందరి ఉద్యోగాలనూ తీసేయాలని అనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. రెండు అంశాలను తొలగించి వస్తే సంతకం పెడతానని స్పష్టం చేశారు. అందుకు కమిషనర్ అంగీకరించలేదు. మరలా రాత్రి 10.30 గంటల సమయంలో మున్సిపల్ కార్యాలయం నుంచి వచ్చిన సిబ్బంది చైర్‌పర్సన్ ఇంటి తలుపు తట్టి, సంతకం కోసం పట్టుబట్టారు. రాత్రి సమయం కావడం వల్ల ఆమె తలుపు తీసేందుకు నిరాకరించారు. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత మరలా ఆమెకు ఫోన్ చేసి, ఒత్తిడి తెచ్చారు.

ప్రణాళిక ప్రకారం వచ్చి.. వివాదం చేసి!

ఉదయం 11 గంటల సమయంలో మున్సిపల్ సమావేశం ప్రారంభమైంది. అప్పటికే పెద్ద ఎత్తున పోలీసులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఏం జరుగుతుందో తెలియక, అక్కడ సిబ్బంది సైతం నిర్ఘాంతపోయారు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి జంప్ అయిన కౌన్సిలర్ మంత్రి రవి మైకు తీసుకున్నారు. రౌడీ షీటర్లు ఇక్కడ ఉండొచ్చా.. వారికి ఇక్కడ కూర్చొనే అర్హత ఉందా? అంటూ వివాదం రాజేశారు. దీనికి స్పందించిన 25వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఎస్.సుధీర్.. దళితుడినైన తనపై అన్యాయంగా కూటమి ప్రభుత్వం వారే కేసు పెట్టించారని తెలిపారు. ప్రభుత్వ సంస్కృత పాఠశాలలో వాచ్‌మన్‌గా పని చేసిన వ్యక్తి కౌన్సిల్ సభ్యుడిగా ఉండవచ్చా? దీనికి ఏమైనా నిబంధనలు ఉన్నాయా? అని మంత్రి రవిని ఉద్దేశిస్తూ, అధికారులను ప్రశ్నించారు. దీంతో ఆగ్రహంగా ఊగిపోయిన కౌన్సిలర్ రవి.. వివాదానికి దిగారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాదన పెరిగింది. తోపులాటకు దారి తీసింది. పార్వతీపురం నియోజకవర్గ ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అక్కడే ఉన్నప్పటికీ వారించే ప్రయత్నం చేయలేదు. కమిషనర్ వెంకటేశ్వర్లు అక్కడే ఉన్న పోలీసులకు సైగ చేశారు. దీంతో పోలీసులు కేవలం వైఎస్సార్‌సీపీకి చెందిన 25, ఒకటో వార్డు కౌన్సిలర్లు సుధీర్, ఆర్.బంగారు నాయుడులను తోసుకుంటూ, నెట్టు కొంటూ బయటకు తరిమేశారు. ఎమ్మెల్యే, పోలీసుల వైఖరిని వైఎస్సార్‌సీపీ సభ్యులు తప్పుపట్టారు. ఏదో వివాదం చేద్దామనే ఉద్దేశంతోనే కూటమి సభ్యులు ఇక్కడికి వచ్చినట్లు అర్థమవుతోందని.. బడ్జెట్‌కు తాను ఆమోదం తెలుపుతున్నామని చెబుతూ చైర్‌పర్సన్ గౌరీశ్వరి సీటు నుంచి లేచి వెళ్లిపోయారు. ఆమె వెంటే వైఎస్సార్‌సీపీ సభ్యులు కూడా వెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే, కమిషనర్, పోలీసుల వైఖరిని నిరసిస్తూ కార్యాలయం గేటు వద్ద ధర్నా చేపట్టారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే వర్గీయులు



వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ను బలవంతంగా బయటకు పంపిస్తున్న పోలీసు

చైర్‌పర్సన్‌ను సైకోగా అభివర్ణించిన ఎమ్మెల్యే

కొద్దిరోజుల కిందటే ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర.. పార్వతీపురం మహిళా తహసీల్దార్ జయలక్ష్మిపై జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే. మరోసారి ఓ మహిళపై ఆయన నోరు పారేసుకున్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. పార్వతీపురం మున్సిపల్ చైర్‌పర్సన్ సైకోలా.. వైసీపీ జగన్‌లా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. సుమారు రూ.80 లక్షల ఖర్చుతో పండగ ఏర్పాట్ల కోసం కౌన్సిల్ సమావేశం నిర్వహించగా.. మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్మార్గంగా అడ్డుకున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ అధినేత జగన్ కూడా ఇలాంటి వ్యవహారశైలితోనే కేవలం 11 సీట్లకే పరిమితమయ్యారని... స్థానిక వైసీపీ నాయకులకూ అదే గతి పడుతుందని విమర్శించారు. రూల్ ప్రకారం.. ఇప్పుడున్న కౌన్సిలర్లతోనే ఒక చైర్మన్‌ను ఎన్నుకుంటామని, బిల్లు పాస్ చేసుకుంటామని, ప్రజాస్వామ్యాన్ని ఆపే హక్కు ఎవరికీ లేదని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ గౌరీశ్వరి

❝ ఏ అంశాలూ చర్చించనీయలేదు..

సమావేశమంతటినీ కూటమి ఎమ్మెల్యే, నాయకులు వారి కనుసన్నల్లోనే జరగాలని చూశారు. అజెండాలో రెండు అంశాలు వద్దని చెప్పాను. వినలేదు. సమావేశం ప్రారంభం కాగానే వివాదానికి తెర తీశారు. కొద్దిరోజుల్లో పండగ రానుంది. నీరు, శానిటేషన్, జనరేటర్ల కోసం అజెండాలో పెట్టారు. పార్వతీపురం ప్రజల కోసం ఆ అంశాలనైనా చర్చిస్తే బాగుండేది. పోలీసులను పెట్టి, మా సభ్యులను ఈడ్చుకుంటూ బయటకు తీసుకెళ్లిపోయారు. మొన్న తహసీల్దార్ మాదిరి ఇప్పుడు నాపైనా సంతకం కోసం ఒత్తిడి చేశారు.

– బోను గౌరీశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్

ఎల్‌ఎంసీ పోస్టు... రూ. 10 లక్షలు!

- విద్యుత్ శాఖలో రూ.38 లక్షలకు నాలుగు పోస్టుల బేరం?
- ప్రజాప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయం కుదరక కలగని మోక్షం



సాక్షి, పార్వతీపురం మన్యం: విద్యుత్ శాఖలో లోడ్ మోనటరింగ్ సెల్ (ఎల్‌ఎంసీ) విభాగంలో పాలిటెక్నికల్ విద్యార్హతతో భర్తీచేసే నాలుగు పోస్టులకు భారీ 'ధర' పలికినట్లు సమాచారం. కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్న ఈ పోస్టులను టెండరు ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగిస్తారు. కొత్త సర్కిల్ కార్యాలయం కావడంతో ఈ నాలుగు పోస్టులతో పాటు.. మూడు స్వీపర్ పోస్టులు మంజూరయ్యాయి. ఎల్‌ఎంసీ విభాగ పోస్టులకు గత నెలలోనే టెండర్ ప్రక్రియ చేపట్టారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి వీరు విధుల్లో చేరిపోవాల్సి ఉంది. ఒక్కొక్కరికీ రూ.25 వేలు వేతనం చొప్పున టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరే నేరుగా వారికి చెల్లిస్తారు. ఈ పోస్టులకు ఎటువంటి నోటిఫికేషన్ ఇవ్వకుండానే కేవలం ప్రజాప్రతినిధుల సిఫారసులతో నియామక ప్రక్రియ పూర్తి చేసేశారు. మొత్తం నాలుగు ఖాళీల్లో ఒకటి కార్పొరేట్ కార్యాలయానికి చెందిన ఒక అధికారి తమ వారి పేరును సిఫారసు చేసుకోగా.. మిగిలిన మూడు పోస్టులూ జిల్లాకు చెందిన ఓ కీలక ప్రజాప్రతినిధి చేతుల్లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఒక్కో పోస్టుకూ రూ.10 లక్షల వరకు బేరం పెట్టి, అమ్ముకున్నట్లు ఆ శాఖలోనే వినిపిస్తోంది. మొత్తంగా నాలుగు పోస్టులకూ రూ.38 లక్షల వరకు పలికినట్లు సమాచారం. పార్వతీపురం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధికి విషయం తెలిసి, తనకు తెలియకుండా ఎలా వేసుకుంటారని అభ్యంతరం పెట్టడంతో వివాదం రేగినట్లు తెలిసింది. మొత్తం ప్రక్రియలో ఈపీడీసీఎల్ పార్వతీపురం సర్కిల్ ఎస్‌ఈ పాత్ర కూడా నామమాత్రమైపోయిందని కార్యాలయ వర్గాల భోగట్టా. ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య పోస్టుల పంపకంలో వివాదం రేగడం వల్లే నేటికీ వారు విధుల్లో చేరకుండా ఉండిపోయారు.

అంత మొత్తంలో వసూలా?

లోడ్ మోనటరింగ్ సెల్ విభాగంలో భర్తీ చేస్తున్న ఈ నాలుగు పోస్టులూ కేవలం కాంట్రాక్టు పద్ధతిలోనివే. ఏటా కాంట్రాక్టును పొడిగించాల్సి ఉంటుంది. విద్యుత్ సరఫరా పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ.. రీడింగ్ ఎంత తగ్గింది, ఏ మేరకు వచ్చింది అన్న వివరాలు పరిశీలిస్తూ, పైకి పంపడం వీరి ప్రధాన విధి. ఈ పోస్టు కోసం రూ.10 లక్షలు చొప్పున లంచంగా తీసుకోవడం.. నిరుద్యోగులు ఇవ్వడంపైనా ఆ శాఖలోని ఉద్యోగులే ఆశ్చర్యపోతున్నారు.

న్యూస్‌రీల్

జూన్ 10 నాటికి గృహ నిర్మాణాలు పూర్తికావాలి

- హౌసింగ్ జీఎం వెంకటరమణ



నర్సిపురంలో గృహనిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ జీఎం వెంకటరమణ

పార్వతీపురం రూరల్: పేదలకోసం నిర్మించే గృహాలను జూన్ 10 నాటికి పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ జీఎం, మూడు జిల్లాల హౌసింగ్ ప్రత్యేకాధికారి వెంకటరమణ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్వతీపురం మండలం నర్సిపురం లే అవుట్‌ను శుక్రవారం సందర్శించారు. గృహనిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, స్టీల్, ఇతర సామగ్రికి కొరత లేదన్నారు. నీటి సౌలభ్యం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. నిర్మాణదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. సమావేశంలో కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్, హౌసింగ్ పీడీ పి.ధర్మచంద్రారెడ్డి పాల్గొన్నారు.

జీకేఆర్ పురం నుంచి జపాన్‌కు..



ఉత్తరాంధ్ర తప్పెటగుళ్ల కళాకారుడు సత్యం

బాడంగి: మండలంలోని జీకేఆర్ పురం గ్రామానికి చెందిన ఉత్తరాంధ్ర తప్పెటగుళ్ల కళాకారుడు నీలబోను సత్యం బృందానికి జపాన్ నుంచి పిలుపు అందింది. జపాన్‌లో తప్పెటగుళ్ల ప్రదర్శన ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇక్కడ నుంచి ఆయనతో పాటు ఆరుగురు కళాకారులు శనివారం జపాన్ చేరుకుంటారు. అక్కడ మన దేశం తరఫున ప్రదర్శన ఇవ్వనున్నారు. జపాన్‌లో ఈ నెల 25 నుంచి 30వ తేదీవరకు నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనల్లో తప్పెటగుళ్ల కళను ప్రదర్శిస్తామని సత్యం తెలిపారు. ఇతర దేశాలకు తమ కళను పరిచయం చేయడం గర్వంగా ఉందన్నారు.

మతోన్మాద శక్తులతో చేతులు కలిపి...

- విజయనగరం విధ్వంసానికి పథక రచన
- తవ్వేకొద్దీ బయటకొస్తున్న సిరాజ్ కుట్రకోణం
- మతోన్మాద శక్తులతో స్నేహం
- ప్రత్యేక యాప్‌లో సంభాషణలు
- పేలుళ్లకు పథకం
- కస్టడీలో ఉన్న సిరాజ్, సమీర్‌ల నుంచి వివరాలు రాబడుతున్న పోలీసులు



సిరాజ్, సమీర్‌లను విచారణ జరుపుతున్న విజయనగరం పీటీసీలోని వర్షా బ్లాక్ ఇదే..

విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లా కేంద్రంలోని ఆబాద్ వీధికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్‌ను అందరిలాంటి విద్యార్థిగానే ఆ వీధి వాసులు భావించారు. పోటీ పరీక్షలకు చదువుతుంటే మంచి విద్యార్థిగానే నమ్మారు. కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు ఈ నెల 16న అరెస్టు చేశాక ఆయనలోని ఉగ్రవాద భావజాలం తెలిసి నిశ్చేష్టులయ్యారు. జన్మనిచ్చిన స్థలం, ప్రశాంతతకు నిలయం.. అన్నిమతాల వారు ఆనందంగా జీవించేందుకు అనువైన.. కళలకు కాణాచిగా ఉన్న విజయనగరాన్ని ధ్వంసం చేసేందుకు పథక రచన చేశాడన్న వార్తతో ఉలిక్కిపడ్డారు. పోలీసుల రిమాండ్ నివేదికలో ఆయన అంగీకరించిన అంశాలను తెలుసుకుని అమ్మో అంటున్నారు. మతోన్మాద శక్తులతో కలిసి సిరాజ్, సమీర్‌ల ఉగ్రకోణంపై ఎన్ఐఏ, స్థానిక పోలీస్ అధికారులు కూపీలాగుతున్నారు. విశాఖ సెంట్రల్ జైల్ నుంచి శుక్రవారం కస్టడీకి తీసుకున్న పోలీసులు సౌదీతో వారికి ఉన్న సంబంధాలు, ప్రత్యేక యాప్‌లో చేసిన చాటింగ్‌లపై ఆరా తీసున్నారు. ఆరేళ్లుగా దేశంలోని ముంబయి, ఉత్తరప్రదేశ్ తదితర చోట్ల జరిగిన మత సమ్మేళనాలకు వీరిద్దరూ హాజరై అక్కడ కలిసిన వ్యక్తుల వివరాలను రాబడుతున్నారు. దేశవ్యాప్తంగా మతోన్మాదాన్ని పెంచేందుకు మజ్వా–ఇ–హింద్ స్థాపించాలని నిర్ణయించడం, దేశం మొత్తం అలజడులు సృష్టించేందుకు పథకరచన చేయడంపై ఆరా తీస్తున్నారు. ఇద్దరి ఉగ్రవాద కుట్రకోణాలను వారం రోజుల్లో సేకరించే దిశగా పోలీసులు విచారణ సాగిస్తున్నట్టు సమాచారం.

సత్వర వైద్యంతో మలేరియా నివారణ



జర్నలో మలేరియాతో చికిత్స పొందిన బాలుడితో మాట్లాడుతున్న మలేరియా డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు

గుమ్మలక్ష్మీపురం: మలేరియా బాధితులకు సత్వరమే మెరుగైన వైద్యసేవలు అందించాలని మలేరియా నివారణ విభాగం డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు అన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని దుడ్డుఖల్లు పీహెచ్‌సీ పరిధిలోని జర్న గ్రామంలో మలేరియాతో బాధపడుతూ చికిత్స పొందిన వారిని శుక్రవారం కలిశారు. వైద్యసేవలపై ఆరా తీశారు. పీహెచ్‌సీలోని ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ల్యాబ్‌లో చేపడుతున్న పరీక్షలతో పాటు జ్వరాల అదుపునకు చేపడుతున్న చర్యలపై వైద్యాధికారి ప్రవీణ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేగిడి పీహెచ్‌సీ పరిధిలోని పెంగవ గ్రామాన్ని సందర్శించారు. దోమల లార్వా ప్రదేశాలను గుర్తించి ఫ్రైడే డ్రైడే ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించారు. రేగిడి పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడుతూ జ్వరంతో వచ్చే ప్రతిరోగికి మలేరియా పరీక్షలు నిర్వహించాలని, నిర్ధారణ అయితే సత్వరమే మందులను అందజేసి, పర్యవేక్షణతో కూడిన వైద్య సేవలను అందించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా మలేరియా నివారణ అధికారి వై.మణి, సహాయ అధికారి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కోటిపాం వంతెనపై వినూత్న నిరసన



కోటిపాం వంతెనపై గోతిలో చేరిన వర్షపునీటిలో స్నానం చేస్తున్న సీపీఎం నాయకుడు కొల్లు సాంభమూర్తి

కొమరాడ: పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారి పూర్తిగా గోతులు మయం అయింది. వాహన చోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. వాహనాలు తరచూ మరమ్మతులకు గురై రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. 1933లో నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీనికి నిరసనగా సీపీఎం నాయకుడు కొల్లు సాంభమూర్తి వంతెనపై గోతుల్లో చేరిన వర్షపునీటిలో శుక్రవారం స్నానం చేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. మూడు రాష్ట్రాల ప్రజలు, వాహనాల రాకపోకలకు ఆధారమైన కోటిపాం వంతెన కూలేపోయే దశలో ఉన్నా పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. పాలకులు, అధికారులు కళ్లుతెరిచి చూడాలని కోరారు. కనీసం గోతులను పూడ్చాలని డిమాండ్ చేశారు.

28 నుంచి ఒకేషనల్ ప్రాక్టికల్స్

పార్వతీపురం టౌన్: ఇంటర్మీడియట్ ఫెయిలైన జనరల్, ఒకేషనల్ విభాగం విద్యార్థులకు ఈ నెల 28 నుంచి జూన్ 1 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్టు డీవీఈఓ డి.మంజులావీణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు జరగనున్నాయన్నారు. జనరల్ విభాగానికి ఒకటి, ఒకేషనల్ విభాగానికి ఐదు పరీక్ష కేంద్రాలను కేటాయించామన్నారు. పరీక్షలు అనంతరం జూన్ 4న నైతికత, మానవ విలువలకు సంబంధించిన పరీక్షను, జూన్ 6న పర్యావరణ విద్య పరీక్షను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గిరిజన గురుకులాల్లో.. ఇంటర్ చదువుకు ఆసక్తి

- జిల్లాలో 1030 సీట్లకు 2,500కు పైగా దరఖాస్తులు
- సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఒకే ఒక బాలికల కళాశాల
- ఇక్కడ 140 సీట్లకు 507 దరఖాస్తులు
- పదోతరగతి మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు
- నేడు నోడల్ కళాశాలల్లో కౌన్సెలింగ్



అత్యధిక దరఖాస్తులు వచ్చిన సీతంపేట బాలికల జూనియర్ కళాశాల

సీతంపేట:

గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఇంగ్లిష్ మీడియం చదువుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు తీవ్ర పోటీ నెలకొంది. జిల్లాలో 8 గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో 1030 సీట్లకు 2,500 మంది దరఖాస్తు చేశారు. సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న నోడల్ గిరిజన గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. పదోతరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపీసీ, బైపీసీ,హెచ్ఈసీ, సీఈసీ, ఒకేషనల్ ఎఅండ్‌టీ, సీజీఏ గ్రూపుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ఏడాది జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాల్లో సుమారు 3 వేల మంది విద్యార్థులు పదోతరగతి పాసయ్యారు. అధిక మార్కులు సాధించిన వారికే గురుకులాల్లో సీట్లు లభించనున్నాయి.

సదుపాయాలతో కూడిన విద్యాబోధన

గిరిజన గురుకులాల్లో చేరే విద్యార్థులకు ఉచిత భోజనం, వసతితో పాటు వైద్య సదుపాయాలు, యూనిఫారం, పుస్తకాలు, ఇతర మెటీరియల్‌ను ప్రభుత్వం సమకూర్చుతుంది. ఈ కళాశాలల్లో సీటు లభించిందంటే కార్పొరేట్ కళాశాలల్లో సీటు లభించినంత ఫలితం ఉంటుంది. సీతంపేట ఐటీడీఏ పరిధిలో సీతంపేట బాలికల గురుకుల జూనియర్ కళాశాల ఒక్కటే ఉండడంతో ప్రవేశాలకు అధిక డిమాండ్ ఉంది. 140 సీట్లకు 507 మంది బాలికలు దరఖాస్తు చేశారు. ఇందులో బైపీసీ గ్రూపునకు 362 మంది దరఖాస్తు చేయడం గమనార్హం.

కళాశాల	సీట్ల ఖాళీలు
సీతంపేట (బాలురు)	170
సీతంపేట (బాలికలు)	140
పెద్దమడి (బాలురు)	120
పి.కోనాయివలస(బాలికలు)	140
పి.కోనాయివలస(బాలురు)	140
కురుపాం (బాలికలు)	80
భద్రగిరి (బాలురు)	120
భద్రగిరి (బాలికలు)	120

సీట్ల కేటాయింపు ఇలా...

జనరల్ గ్రూపులు ప్రతీ గ్రూపుకు 40 సీట్లు కేటాయించారు. దీనిలో ఎస్టీలకు 36, ఎస్సీ, బీసీ, ఓసీ, ఏఈక్యూ (ఏజెన్సీ ఎంప్లాయ్ కోటా) ఒక్కో సీటు చొప్పున భర్తీ చేస్తారు. ఒకేషనల్ ఎఅండ్‌టీ 20, సీజీఏ గ్రూపులో 30 సీట్లు పూర్తి స్థాయిలో ఎస్టీలకు కేటాయించారు.

కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు తీసుకురావాల్సినవి...

టీసీ, స్టడీ సర్టిఫికెట్ (6 నుంచి 10వ తరగతి వరకు), మార్కుల జాబితా, కులధ్రువీకరణ పత్రం (ఒరిజినల్), తల్లి,దండ్రులు, విద్యార్థి ఆధార్ జిరాక్స్‌లు, బ్యాంకు ఖాతా జిరాక్స్ (తల్లి, విద్యార్థి), 6 పాస్‌ఫొటోలు, అన్ని సర్టిఫికెట్లు 3 సెట్ల జిరాక్స్ కాపీలు.

క్లుప్తంగా

పైడితల్లి అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన



స్వర్ణ పుష్పాల అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్‌: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు శుక్రవారం స్వర్ణ పుష్పార్చనలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు శంబర కృష్ణ, సాయికిరణ్‌, అచ్యుత శర్మ, దూసి శివప్రసాద్‌లు శాస్త్రోక్తంగా అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన సేవను నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఇంచార్జ్‌ ఈవో కెఎన్‌విడివి.ప్రసాద్‌ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వన్‌స్టాప్‌ సెంటర్‌లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

విజయనగరం ఫోర్ట్‌: ఐసీడీఎస్‌ పరిధిలోని వన్‌ స్టాఫ్‌ సెంటర్‌లో ఉద్యోగాల భర్తీకి కలెక్టరేట్‌లో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మల్టీ పర్పస్‌ స్టాఫ్‌ కమ్‌ కుక్‌ పోస్టు -1, పారా లీగల్‌ పర్సనల్‌ పోస్టు - 1కి ఇంటర్వ్యూలు నిర్వహించారు. పారా లీగల్‌ పోస్టుకు ముగ్గురు, మల్టీపర్పస్‌ స్టాఫ్‌కు 13 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూ బోర్డు సభ్యులు అయిన సివిల్‌ సప్లయిస్‌ డీఎం బి.శాంతి, డీపీవో టి.వెంకటేశ్వరావు, ఐసీడీఎస్‌ పీడీ రుక్సానా సుల్తానా బేగం, గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్‌ సూర్యనారాయణ, మహిళా పోలీస్‌స్టేషన్‌ సీఐ నరసింహమూర్తి, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు రవికుమార్‌ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

కొత్తవలస సమీపంలో ఏనుగులు



కొత్తవలస సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

కొమరాడ: మండల కేంద్రం సమీపంలోని కొత్తవలస గ్రామ పరిసరాల్లో ఏనుగులు సంచరిస్తూ కనిపించాయి. దీంతో చినఖేర్జిల, నయాబంజుకుప్ప, బూర్జివలస తదితర గ్రామాల గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖాధికారులు సూచించారు. కొమరాడ నుంచి ఖేర్జిల వైపు వెళ్లే ప్రయాణికులు ఏనుగుల సమాచారాన్ని తెలుసుకుని వెళ్లాలని కోరారు. ఏనుగుల సంచార గ్రామాల్లో ప్రజల బయటకు రావొద్దని సూచించారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి

సంతకవిటి : మండలంలో మందరాడ గ్రామానికి చెందిన బురావెల్లి అప్పారావు(58) ఉపాధి వేతనదారుడు పనులు వద్ద వడదెబ్బకు గురై మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 22న మందరాడలోని పెద్దచెరువులో ఉపాధి పనులు నిమిత్తం వెళ్లిన ఆయన మధ్యాహ్నం 5 గంటల సమయంలో అస్వస్థతకు గురయ్యాడు. ఒంట్లో అలసటగా ఉండడంతో తన భార్య ఆదమ్మకు చెప్పి అక్కడే కూర్చుండిపోయాడు. వెంటనే ఆమె తన భర్తకు ప్రాథమిక చికిత్స నిమిత్తం అక్కడి నుంచి ఇంటికి తీసుకొచ్చి ఆర్‌ఎంపీ వైద్యున్ని తీసుకొచ్చింది. ఇంతలోనే అప్పారావు మృతి చెందాడు. ఆరోగ్యంగా తిరిగాడే తన భర్త మృతి చెందడంతో ఆదమ్మ కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది. పొట్ట కూటి కోసం ఉపాధి పనులకు వెళ్తే వడదెబ్బకు తన భర్త గురయ్యాడని రోదిస్తుంది. అప్పారావు ఉపాధి పనులకు వచ్చి అస్వస్థతకు గురయ్యాడని, ఆ కుటుంబానికి ఉపాధి పథకం ద్వారా సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాలల ప్రతిభకు వేదిక బాలభవన్‌

- వేసవిలో ఉచిత శిక్షణకు అనూహ్య స్పందన
- పలు కళల్లో తర్ఫీదు పొందుతున్న 550 మందికి పైగా చిన్నారులు
- 32 సంవత్సరాలుగా సేవలు
- వేసవి శిక్షణకూ ఇతర జిల్లాల విద్యార్థుల హాజరు



ఢిల్లీలో జాతీయ స్థాయి ప్రదర్శనల్లో బాలభవన్‌ విద్యార్థులు



తబలా శిక్షణ ఇస్తున్న రాజశేఖర్‌ మాస్టర్‌



తారక్‌ మాస్టర్‌ నృత్య శిక్షణ

రాజాం : రాజాంలోని మెంతిపేటలో ఉన్న బాలభవన్‌ బాలల ప్రతిభను వెలికితీసే వేదికగా మారింది. పలు కళా రంగాల్లో మక్కువ ఉన్న చిన్నారులకు శిక్షణ ఇచ్చే కేంద్రంగా పేరు తెచ్చుకుంటుంది. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ జవహర్‌ బాలభవన్‌ను ఇక్కడ 1993 జూన్‌ 4న ప్రారంభించారు. అప్పట్లో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రారంభించిన ఈ కేంద్రం ఇప్పుడు సొంత భవనాలతో పాటు ప్రత్యేక సంస్థగా గుర్తింపు పొందింది. మ్యూజిక్‌, డ్యాన్స్‌ రంగాల్లో కేంద్రం ప్రారంభంలో ఇక్కడ శిక్షణ ఉండేది. ఇప్పుడు 16కి పైగా కళా రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలల్లో చదివే విద్యార్థులతో పాటు వేసవిలో రాజాం వచ్చే ఇతర ప్రాంతాల విద్యార్థులకు మంచి వేదికగా ఇక్కడ బాలభవన్‌ వేసవి శిక్షణా తరగతులు నిలుస్తున్నాయి.

ఏమి నేర్పుతున్నారంటే..

గత నెల 24న బాలభవన్‌లో వేసవి శిక్షణా శిబిరాన్ని రాజాంకు చెందిన పలువురు ప్రముఖుల చేతుల మీదుగా డైరెక్టర్‌ సుంకరి రమేష్‌ ప్రారంభించారు. ఈ వేసవిలో ఉచితంగా చిన్నారులకు మ్యూజిక్‌, డ్యాన్స్‌, తబలా, నాట్యం, సంగీతం, ఆర్ట్స్‌, టైలరింగ్‌ వంటి విద్యలలో శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. శిక్షణ నిమిత్తం 550 మంది విద్యార్థులు ఈ ఏడాది ఇక్కడ చేరారు. వీరిలో ఎక్కువ మంది చిన్నారులు నృత్యం, సంగీతం శిక్షణలో ఉన్నారు. ఇక్కడి విద్యార్థులు ఢిల్లీ, గుజరాత్‌, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో జాతీయ స్థాయి ప్రదర్శనలు ఇచ్చి అవార్డులు పొందుతున్న సందర్భాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 200లకు పైగా బాలభవన్‌లు, 47 బాల కేంద్రాలు పని చేస్తుండగా, రాజాం బాలభవన్‌కు ప్రత్యేకత ఉంటుంది. మొత్తం 16 మంది ఉపాధ్యాయులు ఈ వేసవిలో ఇక్కడ చిన్నారులకు తర్ఫీదునిస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది..



రాజాంతో పాటు చీపురుపల్లిలో జవహర్‌ బాలభవన్‌ కేంద్రాలు ఉన్నాయి. ఎంతో కష్టపడి ఈ కేంద్రాలను నిలబెట్టాం. రాజాం బాలభవన్‌కు మంచి గుర్తింపు, పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఇక్కడ శిక్షణ పొందిన చిన్నారులు టీవీ షోల్లో సంగీతం, నృత్యం వంటి రంగాల్లో పాల్గొనే అవకాశం పొందారు. కొంత మంది ప్రైవేట్‌ ఈవెంట్‌లు చేస్తూ రాణిస్తున్నారు. వేసవిలో చిన్నారులు సమయాన్ని వృథా చేసుకోకుండా కాలాన్ని ఆహ్లాదకరంగా సద్వినియోగం చేసుకునేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది.

– డాక్టర్‌ సుంకరి రమేష్‌, డైరెక్టర్‌, బాలభవన్‌

550 మందికి పైగా విద్యార్థులు

రాజాం బాలభవన్‌ వేసవి శిక్షణలో అనూహ్య స్పందన కనిపిస్తుంది. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పలు రకాల వినోద ప్రదర్శనల్లో తన సత్తాను చాటుతున్నారు. బాలభవన్‌ జాతీయ వేడుకల్లో ఇక్కడ బాలభవన్‌ గత 2018 నుంచి మూడు పర్యాయాలు ప్రథమ స్థానాన్ని సాంస్కృతిక కళా రంగాల ప్రదర్శనలో నిలిచింది. దీంతో వేసవి శిక్షణ కార్యక్రమాల్లో ఇక్కడకు ఎక్కువగా విద్యార్థులు వస్తుంటారు. రాజాంలో ఉన్నవారే కాకుండా శ్రీకాకుళం, విశాఖపట్నం, కాకినాడ, హైదరాబాద్‌ తదితర ప్రాంతాల్లో ఉంటున్న చిన్నారులు సెలవులు కారణంగా రాజాం రావడంతో వారంతా ఈ శిక్షణలో పాల్గొని పలు కళారంగాల్లో తమ ప్రతిభను మెరుగుపరుచుకుంటున్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకుంటే స్థలాల స్వాధీనం



మాట్లాడుతున్న గృహనిర్మాణ సంస్థ ప్రత్యేక అధికారి వెంకటరమణ

- గృహ నిర్మాణ సంస్థ ప్రత్యేక అధికారి వెంకటరమణ

విజయనగరం అర్బన్‌: గృహ నిర్మాణ పథకాల కింద గతంలో ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరైన ఇళ్ల నిర్మాణాలు నేటికీ పూర్తి చేయని లబ్ధిదారులంతా వెంటనే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ జనరల్‌ మేనేజర్‌ (ఫైనాన్స్‌) వెంకటరమణ సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు సహాయాన్ని వినియోగించుకొని ఆయా లబ్ధిదారులంతా తమకు కేటాయించిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని లేని పక్షంలో ఆ ఇళ్ల స్థలాలు స్వాధీనం చేసుకొని కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి కేటాయించడం జరుగుతుందన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలించే నిమిత్తం గృహ నిర్మాణ సంస్థ జీఎం శుక్రవారం పలు మండలాల్లో పర్యటించారు. నెలిమర్ల మండలం సీతారాంపేట, బొండపల్లి మండలం గొట్లాం, బొబ్బిలి మండలం పారాదిలో ఇళ్ల కాలనీలను సందర్శించి ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు.

అనంతరం జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌ కార్యాలయంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఈఈ, డీఈలతో గృహ నిర్మాణ ప్రగతిపై సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని నిర్మాణాలకు ఈ సీజన్‌ అనుకూలంగా ఉన్నందున లబ్ధిదారులతో అధికారులు నేరుగా మాట్లాడి ఇళ్ల నిర్మాణంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగించాలని సూచించారు. జిల్లాలో 11,648 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నది లక్ష్యం కాగా ఇప్పటికే 4,649 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన 6,999 ఇళ్ల నిర్మాణాన్ని జూన్‌ 10వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట గృహనిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌ జి.మురళీమోహన్‌ తదితర అధికారులు ఉన్నారు.

స్తంభాన్ని ఢీకొని కాలువలోకి దూసుకెళ్లిన కారు



కాలువలో పడిన కారు నుంచి ప్రయాణికులను ఒడ్డుకు తీసుకువస్తున్న స్థానికులు

బొబ్బిలి: పట్టణంలోని గ్రోత్‌సెంటర్‌ వద్ద ఘోర ప్రమాదం తప్పింది. విజయనగరం నుంచి బొబ్బిలి వస్తున్న పెళ్లి కారు రాయగడ రోడ్డులోని గ్రోత్‌ సెంటర్‌లో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొంది. వేగానికి పక్కనే ఉన్న కాలువలోకి పక్కకి ఒరిగి పోయింది. ఈ సమయంలో విద్యుత్‌ నిలిచిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టయింది. ప్రమాదం జరిగిన సమయంలో స్థానికులు కారులోని పెళ్లి బృందాన్ని బయటకు తీశారు. విద్యుత్‌ ఉద్యోగుల సంఘం, కొప్పుల వెలమ సంఘం రాష్ట్ర నాయకులు బలగ సాయికృష్ణ కుమార్తె పెళ్లి అనంతరం జరిగిన ఈ ఘటనలో కారులో సాయికృష్ణతో పాటు నలుగురు ఉన్నారు. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏం కాలేదు. ఘటన సంగతి తెలుసుకున్న బొబ్బిలి సీఐ కె.సతీష్‌కుమార్‌ తన సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించి ప్రయాణికుల క్షేమ సమాచారాలను కనుగొన్నారు. అంతా ఊపిరి పీల్చుకున్నారు.

చిట్టిబాబుకు జాతీయ అవార్డు



జాతీయస్థాయి అవార్డు అందుకున్న చిట్టిబాబు

విజయనగరం టౌన్‌: భారత రాజ్యాంగ విధాన పరిషత్‌ సభ్యుడు, నేషనల్‌ ఫౌండేషన్‌ ఫర్‌ ఇండియా వ్యవస్థాపకుడు, భారతరత్న సి.సుబ్రహ్మణ్యం జాతీయ అవార్డును జిల్లాకు చెందిన దళిత బహుజన శ్రామిక యూనియన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు శుక్రవారం న్యూఢిల్లీలోని ఇండియన్‌ హేబిటేట్‌సెంటర్‌లో అందుకున్నారు. ఛీఫ్‌ ఇన్‌ఫర్మేషన్‌ కమిషనర్‌ సత్యానంద మిశ్రా, నేషనల్‌ ఫౌండేషన్‌ ఫర్‌ ఇండియా డైరెక్టర్‌ బిరాజ్‌ పట్నాయక్‌, ఎన్‌సీడీహెచ్‌ఆర్‌ నేషనల్‌ జనరల్‌ సెక్రటరీ బీనాపలికల్‌ తదితరుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్టు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. సమాజ మార్పునకు కృషిచేసే 14 మందిని గుర్తించి జాతీయ అవార్డు అందించారని, అందులో తనను ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు.

కళల పరిరక్షణ అందరి బాధ్యత

- మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాల పూర్వ ప్రిన్సిపాల్‌ అనురాధ
- ముగిసిన వాగ్దేవీ బాల సంస్కార శిక్షణ తరగతులు



శిక్షణ పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేత

విజయనగరం టౌన్‌: కళలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల పూర్వ ప్రిన్సిపాల్‌ బురిడి అనురాధ పరశురామ్‌ పేర్కొన్నారు. స్థానిక గురజాడ స్వగృహంలో వాగ్దేవీ సమారాధనం సంస్థ, తెలుగు భాషా పరిరక్షణ సమితితో కలిసి పది రోజుల పాటూ నిర్వహించిన వాగ్దేవీ బాల సంస్కార శిక్షణా శిబిరాల ముగింపు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సనాతన భారతీయ సంస్కృతీ సంప్రదాయాన్ని పరిచయం చేసేందుకు, వాటిని పరిరక్షించాలనే లక్ష్యంతో వాగ్దేవీ సమారాధనం సంస్థ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్‌ పెన్నేటి స్వప్న హైందవి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడంతో పాటూ భగవద్గీత సారాంశాన్ని పది రోజుల పాటూ వివరించామన్నారు. శతక పద్యాలపై అవగాహన పెంపొందించగలిగామన్నారు. ఈ సందర్భంగా పది రోజుల పాటూ ఉచిత రీతిన విద్యార్థులను సుశిక్షితులను చేసిన గురువులను సత్కరించి, ప్రశంసపత్రం, జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థులకు బహుమతులు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్‌ జి.ఎరుకునాయుడు, డాక్టర్‌ జక్కు రామకృష్ణ, అమ్మాజమ్మ, చైల్డ్‌ వెల్ఫేర్‌ కమిటీ చైర్‌పర్సన్‌ గోటేటి హిమబిందు, గురజాడ ఇందిర, మానాప్రగడ సాహితీ, కొంకెపూడి అనూరాధ, చెళ్లపిళ్ల శ్యామల, గిరిజా ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



గడ్డి మందు తాగి మృతి చెందిన శ్రీనివాస్‌

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలం గొటివాడ గ్రామానికి చెందిన తిమ్మక శ్రీనివాస్‌(40) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంట్లోనే గడ్డి మందు సేవించిన శ్రీనివాస్‌ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే కురుపాం సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురంలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం శ్రీనివాస్‌ మృతి చెందాడు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కురుపాం పోలీసులు తెలిపారు.

సీఎం సహాయనిధి నుంచి రూ.14 లక్షల ఆర్థిక సాయం

విజయనగరం అర్బన్‌: అనారోగ్యంతో బాధపడుతూ దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్‌, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ శుక్రవారం సీఎం సహాయనిధి నుంచి ఆదుకున్నారు. జిల్లాకు చెందిన 15 మంది లబ్ధిదారులకు రూ.14.08 లక్షల విలువైన చెక్కులను ఆయన తన క్యాంప్‌ కార్యాలయంలో అందజేశారు.

ఎల్‌ఆర్‌ఎస్‌, బీపీఎస్‌ దరఖాస్తులు పరిష్కరించాలి

విజయనగరం: పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్‌, బీపీఎస్‌ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా కృషి చేయాలని విజయనగరం కార్పొరేషన్‌ కమిషనర్‌ పి.నల్లనయ్య ఆదేశించారు. కార్పొరేషన్‌ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టౌన్‌ ప్లానింగ్‌ ఓపెన్‌ ఫోరం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి క్రెడయ్‌ సంస్థ ప్రతినిధులు హాజరై టౌన్‌ ప్లానింగ్‌కి సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త జీవోలలో ఎదురైన అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేలా కమిషనర్‌ కృషి చేయాలని కోరారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు. మరి కొంతమంది టీడీఆర్‌ సమస్యలపైన ప్రస్తావించారు.

ప్రజాగ్రహానికి రాజకీయ రంగు!

- పండగ ఏర్పాట్లలో వైఫల్యం
- రాజకీయాలు చేస్తున్న టీడీపీ శ్రేణులు



చినకుమ్మరి వీధి వద్ద కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపుతున్న ఫైర్‌ సిబ్బంది (ఫైల్‌)



రామా కాలనీ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగు చేస్తున్న విద్యుత్‌ సిబ్బంది (ఫైల్‌)

సాలూరు: సాలూరులో శ్యామలాంబ పండగ అంగరంగ వైభవంగా చేసేందుకు పట్టణ ప్రజలతో పాటు లక్షలాది మంది భక్తులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. స్థానికంగా ఉన్న ప్రజలు స్నేహితులు, బంధువులను పిలిచి మూడు రోజుల పాటు పండగ వైభవంగా చేసేందుకు సిద్ధమయ్యారు. అనుకున్నట్టు అంతా జరిగింది..వైఫల్యమంతా విద్యుత్‌ అంతరాయంలోనే కనిపించింది. మరోవైపు అంజలి రథ చక్రం విరిగడంతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. పట్టణ వాసులతో పాటు వచ్చిన భక్తులకు విద్యుత్‌ సరఫరాలో ఏర్పడిన అంతరాయం చుక్కలు చూపించింది. మూడు రోజుల పాటు విద్యుత్‌ సరఫరాలో అంతరాయంతోనే సరిపోయింది. ఒకనొక సమయంలో స్థానికులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. పండగ పూర్తయిన తరువాత కూడా విద్యుత్‌ సరఫరా పునరుద్ధరణలో పాలకులు, అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. దీంతో రోడ్లపైనే ప్రజలు విద్యుత్‌ సమస్యపై అర్ధరాత్రి వరకు బైఠాయించారు. అయినా అధికార పార్టీ నేతలు, అధికారుల్లో వీసమంతా చలనం లేకపోయింది. తీరా చూస్తే ఇప్పుడు దీనికి కూడా టీడీపీ శ్రేణులు రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేస్తోంది. అక్కడితో ఆగకుండా అధికారులపై అధికార పార్టీ నేతలు ఆగ్రహిస్తున్నారు.

ప్రజా సమస్యలకు రాజకీయ రంగు

పట్టణ ప్రజలు నాలుగు రోజుల పాటు కరెంట్‌ లేక ఇబ్బందులు పడి రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపడితే దీన్ని ఓ పార్టీకి ఆపాదించే కుట్రలు పన్నుతున్నారు అధికార పార్టీ నేతలు. పండగ నేపథ్యంలో ప్రజలు రూ.కోట్లు ఖర్చు చేసి పండగను చేసుకున్నారు. కానీ విద్యుత్‌ సరఫరాలో తలెత్తిన సమస్యలతో ప్రజలు తీవ్ర అగచాట్లు పడ్డారు. సమస్య ఆందోళనకు దారితీసే పరిస్థితులు వచ్చిన ఇటు పాలకులు కనీసం దాన్ని సరిచేసే ప్రయత్నం చేయలేదు సరికదా.. ఇదంతా రాజకీయమంటూ చెప్పడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

ట్రాన్స్‌ఫార్మర్ల నాణ్యతపై అనుమానాలు

పండగ కోసం సుమారు కోటి 24 లక్షల రూపాయిలతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. అధికారుల మాటలను నమ్మి ఓ అడుగు ముందుకు వేసిన మంత్రి సంధ్యారాణి ఈ విషయమై ఉత్సాహంతో పండగ ఏర్పాట్లు చేసుకోండని పిలుపునిచ్చారు. తీరా చూస్తే విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడికక్కడ కాలిపోయాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యుత్‌ సరఫరా అయిన ప్రాంతాల్లో లో, హై ఓల్టేజీలు తరచూ రావడంతో ఇళ్లల్లో గృహోపకరణాలు పాడయ్యాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే పండగ నేపథ్యంలో విద్యుద్దీకరణ పనుల్లో కొందరికి ముడుపులు అందాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగానే పండగ సమయంలో ఇంతగా విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలిగిందని చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ పండగ సమయంలో మూడు రోజుల పాటు తలెత్తిన విద్యుత్‌ సమస్య నేటికీ చర్చనీయాంశంగానే ఉంది.

చికెన్‌

బ్రాయిలర్‌

లైవ్‌	డెస్‌డ్‌	స్కిన్‌లెస్‌
₹125	₹220	₹230

కోవిడ్‌పై తస్మాత్‌..

- ఆందోళన అవసరం లేదు..
- డీఎంహెచ్‌వో డాక్టర్‌ జీవనరాణి



డీఎంహెచ్‌వో జీవనరాణి

విజయనగరం ఫోర్ట్‌: యావత్‌ ప్రపంచాన్ని వణికించిన కోవిడ్‌ మహమ్మారి మళ్లీ పంజా విసురుతుంది. కోవిడ్‌ పేరు చెబితే ఇప్పటికీ జనం హడలిపోతున్నారు. మొదటి, రెండు కోవిడ్‌ల్లో కోవిడ్‌ బారిన ఎంతో మంది మృత్యువాత పడ్డారు. వేలాది మంది సకాలంలో చికిత్స చేయించుకుని ప్రాణాలతో భయపడ్డారు. రెండేళ్ల పాటు ప్రజలు కోవిడ్‌ కారణంగా బిక్కుబిక్కుమంటూ జీవించారు. గత కొన్నేళ్లుగా వ్యాప్తి లేకపోవడంతో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారు. తాజాగా ప్రపంచలోని పలు దేశాలతో పాటు మన దేశంలో కూడా కోవిడ్‌ కేసులు మళ్లీ నమోదు అవుతున్నాయి. పొరుగున ఉన్న విశాఖలో కూడా కోవిడ్‌ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో కోవిడ్‌ బారిన పడకుండా జనం అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్‌ జీవనరాణి సూచించారు. జ్వరం లేదా చలి, దగ్గు, అలసట, గొంతు నొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కారడం లేదా ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు, విరేచనాలు ఉంటే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. సామూహిక ప్రాంతాల్లో తప్పనిసరిగా మాస్కులు వాడాలన్నారు. భౌతిక దూరం పాటించాలని, హ్యాండ్‌ వాష్‌ తదితర వాటితో పాటు కోవిడ్‌ నిబంధనలు పాటించాలని సూచించారు.

25న విజయభావన సాహితీ సదస్సు

విజయనగరం టౌన్‌: విజయభావన సాహితీ సదస్సును ఈ నెల 25న ఆదివారం సాయంత్రం గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్టు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ ఎ.గోపాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమ భక్తి తత్వం అనే అంశంపై తాడేపల్లిగూడెంకు చెందిన తెలుగు పండితులు డాక్టర్‌ పి.రామచంద్రరావు వక్తగా ప్రసంగిస్తారన్నారు. శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేక నిర్వహకులు నేమాని భద్రాద్రి సీతారామం సభాధ్యక్షత వహిస్తారన్నారు. విజయభావన ప్రత్యేక సలహాదారు డాక్టర్‌ భైరవభట్ల విజయాదిత్య కవితాపఠనం, ఉపాధ్యక్షుడు భోగరాజు ఖాదరవలీబాబూజీ సమన్వయకర్తగా వ్యవహరిస్తారన్నారు. సాహితీవేత్తలు, అభిమానులందరూ హాజరు కావాలని కోరారు.